# ఆదాయ వ్యయాలు

సాయంకాలం అయిదుగంట లవుతూ ఉండగా పాసింజరు బెజవాడ చేరుకుంది. బెజవాడలో అర్జంటుపని ఉన్నవాడల్లే ఆదినారాయణ తోలుసంచి చంకనబెట్టి బండి దిగాడు.

"యుద్ధం ధర్మమా అని, అయిదుగంటలు కావస్తున్నా ఇంకా నాలుఘ్ఘుళ్ళ పొద్దుంది. ఈ వెధవ పాసింజరు తటుకూ - తటుకూమంటూ తెనాల్నించి ఘంటన్నర నడిచింది. ఎక్స్‌ప్రెస్‌లో రావటానికి టిక్కెట్లిచ్చి చావరాయె. నూరు మైళ్ళు దాటి ప్రయాణిస్తేతప్ప....అబ్బ! రైలునిండా జనమే. స్టేషనంతా మనుషులమయం. ప్రయాణం తగ్గించమని సర్కారు వాళ్ళు వేడుకుంటున్నందు కాబోలు జనం ఇంత వేలం వెర్రిగా రైళ్ళెక్కి తిరుగుతున్నారు. బియ్యం బస్తా ముప్పైరూపాయలైతే తిరక్కేం చేస్తారూ?" అనుకుంటూ ఆదినారాయణ రైలుబ్రిడ్జి ఎక్కిదిగాడు.

"రిక్షా చేసుకోండయ్యా" అని రిక్షావాడు సలహా యిచ్చాడు.

"అవునులే, సత్యనారాయణపురాని కేంతీసుకుంటావు?" అన్నా డాది నారాయణ.

"శానా లెక్కుండది మరి. పాల్డబ్బు లిప్పించండి."

"ఇంకా నయం. అసలే ఇదిగా ఉంటేను. ఓ బేడిస్తా, కట్టు."

"అబ్బో! సహానికి సహం వేశారే! నా వల్లగాదు."

"నువ్వూరికే నసపెట్టకు. ఏదో అడిగావు—ఇంకో అర్ధణా[1] చేసుకో."

"సత్తైణాపుర మేడుండదీ. ఎంత లెక్కుండదీ చూస్తే, మీరే ఇందరా అని పాలడబ్బు లిచ్చేస్తారు."

"నాకిన్ని మాటలు పనికిరావు. రెన్నాల్నర చేసుకుని దబ్బున పద. నాకూ అవతల చచ్చినంత పనుంది."

"సరే ఓ అర్ధణాడబ్బులు తగ్గించి మూణ్నాల్నర ఇప్పించండి."

"నన్ను చంపకు. నడిచైనా పోతాను. నీతోనే లక్ష కాలక్షేపమయింది. చాల్లే" అంటూ ఆదినారాయణ దారి పుచ్చుకున్నాడు.

"ఓ పంతులుగారూ! యెల్లమాకండి.... ఆకరిమాట మూణ్నాలిచ్చెయ్యడి. ఊఁ! ఎక్కండి నాకేం పొయ్యేగాలమో, ఈ యిదంగా రేటుకు తగ్గించి చస్తా ఉన్నా, రోజల్లా బండీడిశినా పాలడబ్బు లగుపీవాయె. ఈ కాడికి మూటలు మోస్తే మేలనిపిస్తావుండె," అనుకుంటూ రిక్షావాడు ఆదినారాయణను బండిలో కూచోబెట్టి లాగటం మొదలుపెట్టాడు.

"ఏం రిక్షా బళ్ళు బొత్తిగా గిట్టుబాటుగా లేవాయేం? అన్నా డాది నారాయణ.

"ఏం గిట్టుబాటో అయ్యా, రోజూ కెనిమిదణాలు అద్దెకిందే నంజూతా ఉండారు. మిగిలేది గంజినీలకే చాలవాయె.

"అయ్యో, పాపం! రోజు కెనిమిదణాలు రిక్షా అద్దేమిటి? మీరంతా సమ్మె కట్టి ఏ పావలా రేటు దించండి. లేకపోతే మీగతింతే. ఇదే మెడ్రాసయితేనా—?"

"ఆఁ! సమ్మె యాడబడుద్దిలెండి. ఓడికోడు కలిచ్చేస్తారా? వొట్టిది. నాబోటి యదవనాయాల రేటు దించకుండా ఉంటే అదేశాన...."

"ఇదిగో, చూడూ. నువు కొంచెం తొరగా బోతే మంచిది. ఎందుకంటే నాకింకా శానాపనుంది."

"వచ్చేశాంలెండి. మీరు దిగే యిల్లిదా?"

"అదుగో, ఆ కనబడే వాకిలిముందాగు....ఇంద నీ డబ్బులు."

---

1. అణాలో సగం=రూపాయలో 32వ వంతు.

"ఇంకో అరదణా ఇప్పించండి. సత్తెప్రమానకంగా జెబుతుండా. పాల్డబ్బులకు తగ్గించి ఎవుడూ రిక్షా కట్టడీడకు. శాన్లెక్కుండది."

"అదే మీ రిక్షావాళ్ళదగ్గిరుండే జబ్బు. అన్నమాట మీదుండరు."

"ఏదో, పొద్దుగాల్నుంచీ గెట్టి బాడిగె దొరక్క నోరుజారి మూణ్ణా లన్నాగాని_"

"సరేలే, ఇచ్చిందేదో తీసుకో పో."

"ఏఁవమ్మా. వొదినా? ఎట్లా ఉన్నారు?" అన్నాడు ఆదినారాయణ.

"ఏంవుండటం. నాయనా? ఎట్లా ఉండాల్లో అట్లా వున్నాం. మీ అన్నయ్య కింకా ఒంట్లో బలం చిక్కలేదు. జబ్బులోవచ్చి చూణ్ణన్నా చూడకపోతివిగా! బతుకుతారనుకున్నామా? ఆ ఉద్యోగంకాస్తా పోయింది. ఊరంతా బాకీలే! వచ్చేళ్ళతో తిన్నామో, పస్తే పడుకున్నామో విచారించిన వాళ్ళు లేరుగదా! వచ్చవచ్చగా వున్నప్పుడే బంధువులుగాని ఆపత్కాలంలో అదుకునే దెవరు నాయనా?"

"అయ్యో, పాపం! నాకు తెలీదమ్మా వొదినా. తెలిస్తే ఏదన్నా సహాయం తప్పకుండా చేసేవాణ్ణి. భాగ్యమా? ఎంత దబ్బొస్తున్నదో ఎంత పోతున్నదో!"

"అదృష్టవంతులు మీకేం నాయనా! ఏ జన్మలోనో పెట్టిపుట్టారు. సుఖ పడుతున్నారు. మే మే జన్మలో చేసుకున్నామో ఇప్పుడనుభవిస్తున్నాం"

"అదేం మాటలే!"

"ఏం పనిమీద వచ్చావో, భోజనాని కిక్కడే ఉండు"

"లేదులే. నేను మళ్ళీ ఈ బండికే ఇంటికెళ్ళాలి. అది కనిపెట్టుకుని ఉంటుంది. నా కింకా బోలెడంత పని వుంది. మళ్ళీ నాలుగైదు రోజుల్లో ఎట్లాగూ రావాలే. ఇంతకూ అన్నయ్యను చూడటం పణ్ణేలేదే. ఎటెళ్ళాడు?"

"అట్లా పార్కుదాకా నడిచి వస్తానని ఇప్పుడే వెళ్ళారు.

"ఇంకేం? నే నదే వెళుతున్నాలే్న."

ఆదినారాయణ అక్కడ బయలుదేరి ప్లీడరుగారింటికెళ్ళాడు. ప్లీడరుగారు ఏలూరు వెళ్ళారనీ రాత్రి మెయిలులో వస్తారని తెలిసింది.

"అయితే, ఏఁవండీ? ఇక్కడ బియ్యం ధర ఎట్లావుంది? అన్నాడు ఆది నారాయణ ప్లీడరుగారి తండ్రితో.

"ఇరవై తొమ్మిదీ, ముప్పయినూ!"

"అంతటా ఓటిగానే తగలబడుతున్నది. ఈ యుద్ధం చూశారూ! ఒక చోటుండి ఒకచోట లేదనటానికి లేదు. అంతా పాపం పండి బద్దలవుతున్నది లెండి. జనక్షయం కావలిసిందే. తద్వారాగాని పాపక్షయం కాదు."

"ఏం పాపక్షయమో! యుద్ధం వచ్చాకే పాపం పెరిగిపోతోంది. దగా కోర్లంతా బాగడిపోతున్నారు. ధరలు మండిపోతున్నాయి. జనం అల్లాడి పోతున్నారు."

"యదార్థం అన్నారు. కోర్టులన్నీ పాడుబడిపోయినై. అసలు క్లయింటంటూ ఏదండీ? నెలకు వెయ్యి సునాయాసంగా సంపాదించిన మా వూరి రామ్మూర్తి గారు ఈ సంవత్సరం పద్దెనిమిదొందలమీద ఇన్‌కంటాక్సు కట్టాడు....మేలు వేళకు వచ్చి ప్లీడరుగారికి కనిపించి పోతా!"

"ఏంరా, కేశవులు ఎక్కడికో బయలుదేరుతున్నావే?"

"అట్లా స్టేషనుదాకా. ఎప్పుడు రాక?"

"ఈ సాయంకాలమే వచ్చాలే. ఎట్లావుంది వ్యాపారం?"

"వ్యాపారానికేం? దివ్యంగా వుంది. ఈ యుద్ధం మనం బాగుపడటాని కొచ్చిందనుకోవలసిందే. నిరుడీ రోజులలోకూడా మా భాగస్తుడు సరుకమ్మేయ్య మని పోరుతూ వచ్చాడు. కాస్త ఉండరా అని వాణ్ని అణిచిపెడుతూ వచ్చా. చూ దెంత లాభించిందో! న్యాయం పడితే లాభంలో నేను మూడొంతులు తీసు కొని, మా వాడికి ఒక వొంతు ఇయ్యొచ్చు. కాని మన కన్యాయం దేనికి? నేను వాడికి సహం లాభం ఇచ్చేస్తున్నా. ఏమంటా?

"కాదుమరీ? కాస్త వ్యవహారం మాటలాడదామనుకున్నాగాని, వేళగాని వేళొచ్చావే?"

"వేళకే వచ్చావుగా? స్టేషనుకు పోదాంపదా."

"రావటానికేంగాని' ప్రతిసారీ నువ్వే డబ్బిచ్చుకుంటావే? ఎట్లా చావను?"

"పోనీ_"

"నేనే ఇచ్చుకుందామంటేనేమో మనదగ్గిర సమయానికి సంచీ నిండు కుంటుందాయె. ఈ దిక్కుమాలిన ప్రయివేటు గిరీ కాకుండా నేనుకూడా ఏ వ్యాపారమో చేసుకునుంటే ఎంత బాగుండేది!"

పోనీరా. వెధవ డబ్బా! ఎట్లా వస్తుందో! ఎట్లా పోతుందో!"

"నీకేంరా? ఏ జన్మలోనో పెట్టిపుట్టావు! పద అయితే."

ఆదినారాయణ హోటల్లో భోంచేసేడు. అయిదణాలతో పోయింది. తన పెత్తల్లి కొడుకుగారింట భోజనానికున్నట్టయితే అధమం ఐదు రూపాయలైనా వాళ్ళకు చేబదులిచ్చుకోవలిసొచ్చేది....కేశవులుగాడిదగ్గిర డబ్బు మూలుగు తున్నది స్పెన్సరువాళ్ళకు ఓ పదిరూపాయల నోటిచ్చుకున్నాడు. తనకింద ఐదు రూపాయలు ఖర్చుచేశారు. "నాకు విస్కీ వద్దులే, ఆ ఐదు రూపాయలూ

ఇచ్చెయ్" అంటే చచ్చినా ఇవ్వడు కేశవులు. సరే. ఇక్కడి కిదే దక్కుడు.... ఈ స్థితిలో ప్లీడరుగారి దర్శనం చేసుకోవటం భావ్యంకాదు కనక తెల్లారేదాకా వాళ్ళ పంచనే నడుం వాల్చే అవకాశం లేదు. మరి ఈ రాత్రి ఎక్కడ గడపటం? కేశవులుగారింటికిపోతే? "మా వాళ్ళింటికి పోలేదేం?" అని అడుగుతాడు కాక పోయినా వాడికి తగని భయం – వాడి పెళ్ళాన్ని ఎవరెత్తుకుపోతారో అని! చాలా అందగత్తెలే మరి! ప్రపంచంలో వుండే అందగత్తెలంతా ఎవరి పెళ్ళాలో అవుతారు. అందగత్తె అనగానే బోగందే దక్కదు. ఎవడో వట్టేస్తాడు!.... రంగనాయకి ఇంటికిపోతే? అది చిలుం వదులుస్తుంది....సినిమాకు పోతే!

కళామందిరంలో ఏదో కొత్త తెలుగుటాకీ ఆడుతున్నది. హాలు ముందు జనం తోసుకుచస్తున్నారు. ఈ దిక్కుమాలిన యుద్ధమే ఈ సినిమాల వేలం వెర్రికి కారణం. లేకపోతే ప్రతి చచ్చు సినిమాకు ఇంతేసి జనమా? తీరాచూస్తే ఒక్క పిక్చరులోనూ టెంపోయే ఉండదూ!....ఇక్కడ ఏ పెద్ద టిక్కెట్టో కొని ఒంటిగంటనించీ జాగారం చేసేకంటే ఆ రంగనాయ కింటికి పోతేనే మేలూ! దరిద్రమ్ముండ!

"ఏమే. రంగసానీ?" బాగున్నావా?"

"ఎప్పుడొచ్చా? ఈ మద్దె. కనిపించటం లేదేంవనడిగితే, "పోయినాడుగా!" అన్నారే. అన్నీ వొట్టిదేనా?"

"ఏడిశావులే! నాకు నిద్దరొస్తున్నది. వక్కమీదికి కాస్త చలవ దుప్పటి తీసి మరీవెయ్యి. ఆ చేతితోనే కాస్త దిళ్ళ గలీబులుకూడా మార్చు"

"అట్టానే! చాకల్చచ్చినోడొచ్చి చావలా! యిష్టంవైతే ఉన్న వక్కమీద పడుకో. లేకపోతే గాంధీనగరం పో. అదేసుద్దిలో చలవ దుప్పట్లు."

"గాంధీనగరంవేంవిటి? నీ తలకాయ?"

"నే నెరగనట్టా? నాకాడ దాస్తావేం?"

"నా పెళ్ళాం నన్నింత అదుపుచెయ్యదు, నీ పీడేమిటంటా!"

"నీ పెళ్ళాం అదుపుచేస్తే నువ్ బాగానే ఉండేవాడివిగా, అది లేకపోమట్టే కారెక్కి తిరుగుతుండావు. ఆ రమాపుణి ముండకి పాతిక ముడుపు చెల్లించావంటగా! అంతేలే! మా జాతి కృనికిరంవుంటే ప్రతి చచ్చినాడు నూ జేసినట్టే చేసిపోతాడు."

"నువ్వొక్కడికి మా ముండవైనట్టు."

"నా మంచి నువ్వెరగవంటలే! ముందు సంచీ యిప్పి డబ్బేముందో చూపియ్!"

"నీ బొందా, నా బొందానూ! అయిదురూపాయలునై న్నా!"

"సాలవే! ఎట్టానబ్బా!"

"దేనికి చాలవంటా?"

"రేపా కోఁవిటాయినొచ్చి నా గొంతిమీద కూచుంటాడే!"

"ఇంకొంచెం నాజూగ్గా కూచోబెట్టి నువ్వే వాణ్ని గొరిగి పంపించు!"

"ఫా! కొరివి వచ్చిన మాటలూ నూవూనూ! సంచి యివ్వవేం?"

మర్నాడు ఆదినారాయణ తిరుగుబండిలో ఎక్కి కూచున్నాడు. అతని అంతరాత్మ అతన్ని నిలవదీసి క్రాసుపరీక్ష చేస్తున్నది.

రంగనాయకి ముండ తిట్టాలిసిన తిట్టన్నీ తిట్టి, బతిమాలి వగలుచేసి, ఆఖరుకు కళ్ళనీళ్ళు పెట్టుకుని, ఎల్లాగయితేనేం పదిరూపాయలనోటు వొలుచు కుంది. తను అయిదురూపాయలకోసం వెనక్కుతీశాడు గాని, తన పెత్తల్లి కొడుకు గారింట్లో మకాం వేసివుంటే ఈ పదిరూపాయల ఖర్చూ తప్పేది. వాళ్ళకూ కష్టసమయంలో సహాయం చేసినవాడయేవాడు. కలకాలం చెప్పుకునే టందు కుండేది. లేదూ, ఆ కేశవులు వెంటవెళ్ళి ఆ తాగుడు తాక్కపోయినా బాగుండేది. రాత్రి ఆ ప్లీడరుగార్ని కలుసుకుని ఆయనతో వ్యవహారం కాస్తా అప్పుడే తేల్చుకుని, తెల్లవారేదాకా అక్కడే పడుకుని ఉదయం బండిలోనే కొంప చేరుకునే వీలుండేది. ఈ ఖర్చూ తప్పేది.... ఖర్చయితే అయింది. ఫలం దక్కవుంటే! అదీకాలేదు. తను తెచ్చిన కాగితాలు నాలుగూ చూసి ప్లీడరుగారు కేసుచేసి లాభంలేదన్నాడు. అంతా వృధా ఖర్చు, వొట్టిదండగ, పది రూపాయలు!.... పాపఫలం! అందుకే పెద్దలు సన్మార్గాన సంచరించమన్నారు. సందేహమేమిటి?....

ఇప్పుడన్నా మించిపోయిందేముందీ? కోర్టుకెక్కి లాభంలేదన్నారని అని ఆ బసవయ్యతో అనటం దేనికి? కేసు చూస్తానన్నారంటే ఆ బసవయ్య పాతికో పరకో రాలుస్తాడు. అల్లా అయితేగాని అయినఖర్చు కలిసిరాదు. మొదట్లో బసవయ్య ఎంత పురెక్కించినా పేడకడి జారినట్టు జారుతూ వచ్చాడుగాని, ఈమధ్య కాస్త పదునెక్కాడు. వాడికి తరువాత చావుకబురు చల్లగా చెప్పొచ్చు....

ఆదినారాయణ మొహం వికసించింది. కిటికీలోనించి బయటికి తొంగి చూశాడు. ప్రపంచమంతా ప్రశాంతంగా ఉంది ఎక్కడో యుద్ధం జరుగుతున్న దిట. మనకేం భయంలేదు. భగవంతుడి దయవల్ల మనదేశం ఎప్పటికి ఇల్లాగే ఉంటుంది.... కేశవులుధర్మాన ఇంతకాలానికి మళ్ళీ నిన్న కాస్త మంచిసరుకు మళ్ళీ జిహ్వకు తగిలింది.... రంగనాయకి కూడా ఎల్లాఅయినా బోగంవాళ్ళల్లో

తప్పుబుట్టిందనే చెప్పాలి. దానినోరు చెడ్డదన్నమాటేగాని, దానికి హృదయం ఉంది.... బసవయ్యా చాలా మంచి క్లయింటు.... చాలా డబ్బు.... మంచి హృదయం.... భలేసరుకు....

ఆదినారాయణ అంతరాత్మ నిశ్చితంగా నిద్రపోతున్నది. ఆదినారాయణ కూడా చల్లగాలి కట్లా కన్నుమూశాడు.

[ముద్రణ : డిసెంబరు 1963, కొడవటిగంటి కుటుంబరావు కథలు, బతకనేర్చినవాడు (సంపుటి), నవభారత్ ప్రచురణ, మొదటి ముద్రణ.]